

లోకేష్ పిల్ల బిత్రే : రోజా

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: లోకేష్ పిల్లబిత్రే... ఎప్పుడు.. ఎందుకు.. ఎవ్వరి.. గురించి మాట్లాడుతాడో తెలీదని తెలుగుదేశం జాతీయ కార్యదర్శి నారా లోకేష్‌పై మంత్రి రోజా ఘాటన విమర్శలు చేశారు. ఎప్పుడు తన కుటుంబం తన రాజకీయం తప్ప ఇతరుల ఎదుగదలను తెలుగుదేశం అధినాయకత్వం చేయలేదన్నారు. పేదల సంక్షేమం తెలుగుదేశానికి పట్టదన్నారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి నివాళ్ళు అర్పించిన అనంతరం లోకేష్‌ను పిల్లబిత్రేగా అభివర్ణిస్తూ జగన్ పాలనలో అన్నివర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని అంబేద్కర్ ఒక్క కులానికే కాదని దేశానికి మార్గదర్శమంటూ ప్రపంచ మేథావి అంబేద్కర్ అడుగుజాడల్లో నడవాలని పిలుపునిచ్చారు. అలా నడుస్తున్న అనేక రాష్ట్రాలు అభివృద్ధి సాధించాయన్నారు.

బండ బాదుడు..!



- రూ.1200కు చేరువలో సిలిండర్ ధర
- మెల్లమెల్లగా 'సబ్సిడీ' ఎత్తేసిన కేంద్రం
- మోడీ హయాంలో ఏడాదికి రూ.100కోట్ల భారం

ప్రజాశక్తి - చిత్తూరుఅర్బన్

'పొయ్యి నుంచి వచ్చే పొగ వల్ల మహిళల కళ్లల్లో కన్నీరు వస్తుంది.. ఏ మహిళ కంటా కన్నీరు రాకూడదు.. సబ్సిడీపై అందరికీ గ్యాస్ సిలిండర్లు ఇస్తాం.. మహిళలు ఎంచక్కా గ్యాస్‌స్టవ్‌పై వంట చేసుకోవచ్చు అని పాలకులు రెండు దశాబ్దాలుగా పదేపదే ఊదరగొట్టి అందరితో గ్యాస్ స్టవ్‌లు, సిలిండర్లు కొనిచ్చారు.. సబ్సిడీపై సిలిండర్లు తక్కువ ధరకు ఇస్తామని పేదలనూ వదలకుండా 'గ్యాస్' కొట్టారు.. తీరా 2014 నుంచి మోడీ హయాంలో సిలిండర్‌పై రూ.800 పైనే పెంచేశారు. విడతలవారీగా తొమ్మిదేళ్లలో దొంగదెబ్బ కొట్టారు.. పెంచిన ధరలు అర్ధరాత్రి నుంచే అమల్లోకి వచ్చేవి. ఉదయాన్నే నిద్రలేచిన మహిళలు ఉలిక్కిపడేవారు. గతంలో చౌక దుకాణాల్లో కిరోసిన్ ఇచ్చేవారు. అదీ లేకుండా చేశారు. ప్రస్తుతం పొయ్యి లేదు.. కిరోసిన్ లేకుండా చేశారు. వంటింట్లో గ్యాస్ వెలిగించాలంటే 'సెగలు' పొగలు కక్కుతోంది.. కుటుంబంలో 'లోటు' బడ్జెట్ నడుస్తోంది. గ్యాస్ ధరల పెంపుతో మోడీ హయాంలో ఏడాదికి రూ.100 కోట్ల భారం జిల్లా ప్రజానీకంపై పడింది.



ఏడాదికి ఐదారుసార్లు గ్యాస్ ధరలు పెంచేసి మోడీ ప్రభుత్వం మహిళల కంట కన్నీరు తెప్పిస్తోంది. దీనికితోడు 2020 నుంచి గ్యాస్ సబ్సిడీ ఎత్తేశారు. ప్రస్తుతం గ్యాస్ ధర 1155గా ఉంది. త్వరలోనే 1200కు చేరువయ్యే అవకాశం లేకపోలేదు. మరోసారి మోడీ గెలిస్తే మాత్రం రూ.1500 సిలిండర్‌కు సమర్పించాల్సిందేన్న విమర్శలూ లేకపోలేదు. గ్రామీణ మహిళలు ఇప్పటికే సిలిండర్ వదిలి పొయ్యి వైపు మళ్లుతున్నారు. సమీపంలోని అడవికి వెళ్లి కట్టెలు తెచ్చుకుంటున్నారు. ఎంతో అత్యవసరమైతే తప్ప గ్యాస్ స్టవ్‌ను గ్రామాల్లో వెలిగించడం లేదు. నగరాల్లో అయితే సిలిండర్ల వాడకం పెరిగింది. అవసరాల రీత్యా ధర ఎంతున్నా కొనాల్సిందేనని, బంధువులు వచ్చినపుడు ఒకట్రెండు సిలిండర్లు ఇంకా ఎక్కువ అవుతాయని నగరవాసులు వాపోతున్నారు. గ్రామాల్లో మాదిరి పొయ్యి వెలిగించలేమని, గతంలో ఇచ్చే కిరోసిన్ కూడా లేకపోవడంతో అనివార్యంగా గ్యాస్ వాడాల్సిందేనన్నది వారి ఆవేదన.

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మొత్తం 15,89,752 గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. ప్రతినిత్యం 66వేల నుంచి 75వేల సిలిండర్ల అమ్మకాలు చేస్తున్నారు. ఇందులో హెచ్‌పి, ఇండెన్, భారత్‌గ్యాస్ కంపెనీలు ఉన్నాయి. గత ఏడాది డిసెంబర్ నాటికి గ్యాస్ సిలిండర్ ధర రూ.1050 ఉండేది. ఈ ఏడాది మార్చి నాటికి రూ.1155కు చేరుకుంది. అంటే నాలుగు నెలల్లోనే వంద రూపాయలను కేంద్రం పెంచేసింది. నెలకు 8 కోట్ల 17 లక్షలపైనే భారం పడుతోంది.

సామాన్యులు బతికే పరిస్థితి లేదు..

- అరుణ, తెలుగు మహిళా జిల్లా ప్రధాన కార్యదర్శి



కేంద్రంలో మోడీ పాలనలో నిత్యావసర వస్తువుల ధరలతో పాటు గ్యాస్, డీజిల్ వంట గ్యాస్ ధరలు విపరీతంగా పెరగడంతో సామాన్య, మధ్యతరగతి పై మోయలేని భారం పడుతోంది. పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలను అదుపు చేయలేని ప్రభుత్వం గద్దెదిగాలి. వంట గ్యాస్ ధర వెయ్యి రూపాయలు చేరుకుంది. పెరిగిన వంట గ్యాస్‌తో తిరిగీ కట్టెలపొయ్యి వాడాల్సిన పరిస్థితి ఏర్పడింది. కార్పొరేట్ జపం చేస్తున్న బిజేపి ప్రభుత్వం సమాన్యుల సమస్యలను పట్టించుకోవడం లేదు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటుపరం చేసేందుకు వేగంగా పావులు కదుపుతోంది. విద్యుత్ సమస్కరణల పేరుతో విద్యుత్‌ఛార్జీలు కూడా పెరగనున్నాయి. వంట గ్యాస్ ధర పెంపుతో మహిళ ఉసురు పోసుకుంటున్న కేంద్ర ప్రభుత్వం మట్టికొట్టుకుపోవాలి.

వంట గ్యాస్ ధర తగ్గించాలి

- షకిల, ఆంధ్రప్రదేశ్ మహిళా సంఘం (ఐద్వా), నగర కార్యదర్శి



మోడీ పాలనలో ఎన్నడూ లేని విధంగా వంట గ్యాస్ ధరలు విపరీతంగా పెరిగింది. పెట్రోల్, డీజిల్ ఛార్జీల పెంపుతో నిత్యావసర వస్తువుల ధరలు పెరిగాయి. కనీస వేతనాలు అమలు కాక స్కీమ్ వర్కర్లు అల్లాడుతున్నారు. సంస్కరణల పేరుతో ప్రభుత్వరంగ సంస్థలను కారు చౌకగా కార్పొరేట్ సంస్థలకు అప్పగించాలని కేంద్రంలోని మోడీ సర్కారు ప్రయత్నిస్తోంది. మతవిద్వేషాలు రెచ్చగొట్టి హిందు ముస్లీముల మధ్య గొడవలు సృష్టిస్తున్న మోడీ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలే మహిళా లోకం నడంభిగించాలి.

మోడీ పాలనకు చమరగీతం పాడాలి

- రమాదేవి, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య నగర నాయకురాలు



అన్నివర్గాల ప్రజల ఉసురుపోసుకుంటూ ప్రజావ్యతిరేక వినాశర విధానాలతో రాజ్యమేలుతున్న మోడీ సర్కార్‌కు రోజులు దగ్గరపడ్డాయి. విభజన హామీలు ఒక్కటి కూడా అమలు కాలేదు. నిత్యావసర సరుకులు ఆశాన్ని అంటుతున్నాయి. మతోన్మాద శక్తులు పెట్రేగిపోతున్నాయి. మనువాద సిద్ధాంతో మహిళలను తక్కువ చేసి చూపుతున్నారు. హిందు సాంప్రదాయం పేరిటి మహిళలను తిరిగే వంటింటికి పరితం చేయాలనే ప్రయత్నం చేస్తోంది. హిందు ముస్లీమ్‌ల మధ్య మత చిచ్చు రేపుతోంది. నిత్యావసర వస్తువుల ధరలు, పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించేంత వరకు పోరాటాన్ని సాగించాలి.

అంబేద్కర్ ఆశయాలకు తూట్లు పొడిచే...

బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దింపుదాం..!

వామపక్షాల 'ప్రచారభేరి' ప్రారంభం



అంబేద్కర్ విగ్రహం నుండి ప్రారంభమైన వామపక్షాల ప్రచారభేరి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగా, రాష్ట్రానికి ద్రోహం చేసే విధానాలపై సిపిఐ- సిపిఎం రాజకీయ ప్రచారభేరి కార్యక్రమంను శుక్రవారం చిత్తూరు అంబేద్కర్ విగ్రహం వద్ద సిపిఎం రాష్ట్ర నాయకులు దడాల సుబ్బారావు ప్రారంభించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు అధ్యక్షత వహించారు. ముందుగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్ 132వ జయంతి సందర్భంగా పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించి సభను ప్రారంభించారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర నాయకులు దడాల సుబ్బారావు, సిపిఐ జిల్లా కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ మోడీ విధానాలు దేశానికి రాష్ట్రానికి నష్టదాయకంగా తయారయ్యాయని రాజ్యాంగ, ప్రజాస్వామిక హక్కులను ధ్వంసం చేస్తున్నదని తెలిపారు. కార్పొరేట్ శక్తులను ప్రోత్సహిస్తూ, ధరలు పెంచి ప్రజలపై భారాలు వేశారని, వీటిపై పోరాటాలు చేస్తున్న ప్రతిపక్ష పార్టీలపై సిబిఐ ఇడిని, గవర్నర్లను ఉపయోగిస్తు నిరంకుశదాడి చేస్తున్నారని తెలిపారు. రాష్ట్రానికి ద్రోహం చేస్తున్న బిజెపిని అధికార పార్టీ వైసిపి, ప్రతిపక్ష పార్టీలు తెలుగుదేశం, జనసేన మోస్తున్నాయని విమర్శించారు. బిజెపి మతోన్మాద ప్రజావ్యతిరేక చర్యలను ఖండించాలని వామపక్షాలు చేపట్టే పోరాటంలో ప్రజలు కలిసి రావాలని కోరారు. మోడీ నిరంకుశ చర్యలను ఖండించాలని ప్రచారభేరి యాత్రలో.. సభలో.. విస్తత ప్రచారం జరుగుతుందని దీనిలో ప్రజలంతా పాల్గొవాలని కోరారు. ఏప్రిల్ 14న అన్ని మండల కేంద్రాల్లో అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రారంభించి 30వ తేదీ వరకు పాదయాత్రలో సభలు సమావేశాలు జరుగుతాయని తెలిపారు. గల్లి నుంచి ఢిల్లీ వరకు ప్రతిఒక్కరూ మతోన్మాద బిజెపి మోడీని గద్దెదించే వరకు కలిసి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి సురేంద్ర, సిఐటియు జిల్లా అధ్యక్షులు చైతన్య, కెవిపిఎస్ జిల్లా నాయకులు లోకయ్య, డప్పు కళాకారులు, సిపిఐ నాయకులు విజయగౌరి, చంద్ర, సత్యమూర్తి, రమాదేవి లతో పాటు కార్మికులు, మహిళలు పాల్గొన్నారు.




అంబేద్కర్ నుంచి స్ఫూర్తి పొందాలి: కలెక్టర్



అంబేద్కర్ జయంతి సభలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: డాక్టర్ బిఆర్.అంబేద్కర్ నుంచి స్ఫూర్తి పొందాలని జిల్లా కలెక్టర్ సగిలి షన్మోహన్ పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం స్థానిక డాక్టర్ బిఆర్.అంబేద్కర్ భవనంలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, నగర పాలక సంస్థ మేయర్ ఆముద, జడ్పీ వైస్ చైర్పర్సన్ రమ్య, డిఆర్ఓ ఎన్.రాజశేఖర్, ఆర్డీఓ రేణుక, సాంఘిక సంక్షేమ, సాధికారత అధికారిణి డాక్టర్ రాజ్యలక్ష్మి, డివిఎంసి సభ్యులతో కలసి భారత రత్న రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 132వ జయంతి వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నవభారత రాజ్యాంగ నిర్మాత ఆయన డాక్టర్ బిఆర్.అంబేద్కర్ నుంచి మన మధ్య స్ఫూర్తి పొందాలని పది మందికి సాయపడేలా మన వ్యక్తిత్వం ఉండాలని ఆయన అనుసరించిన మార్గంలో మనమందరం అడుగులు వేయాలని తెలిపారు. అనంతరం దళిత గిరిజన సంఘ నాయకులను, డివిఎంసి సభ్యులను ఘనంగా సన్మానించారు. అంతకుముందు అంబేద్కర్ 132వ జయంతి వేడుకల సందర్భంగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి జ్యోతి ప్రజ్వలన గావించారు.

అంబేద్కర్ భవన్‌లో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించిన జయంతి సభలో ఎస్సీ, ఎస్టీల అభివృద్ధి కోసం కృషి చేసిన దళిత, గిరిజన సంఘాల నేతలను సన్మానించారు. చిత్తూరు ప్రభుత్వ డ్రైవర్స్ అసోషియేషన్ నాయకులు పనీర్ సెల్వం నేతృత్వంలో అంబేద్కర్‌కు నివాళు ళ్ళ అర్పించారు. విద్యుత్ ఉద్యోగుల సంఘం నాయకులు విఘ్నేశ్వరావు నేతృత్వంలో విద్యుత్ ఉద్యోగులు అంబేద్కర్ విగ్రహానికి నివాళ్ళు అర్పించారు. దళిత, గిరిజన సంఘాల ఐక్యవేదిక నాయకులు అంబేద్కర్‌కు నివాళ్ళు అర్పించారు.




అంబేద్కర్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న ఎస్సీ, ఎస్టీ ఉద్యోగ సంఘం నాయకులు

ఎస్సీ, ఎస్టీ ఉద్యోగ సంఘం నేతల ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి గజమాలను వేసి, దుశ్శాలువుతో సత్కరించి, నివాళులర్పించడం జరిగింది. అంబేద్కర్ భవనంలో 100మందిని రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కె.వినాయకం సన్మానించడం జరిగింది. రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కె.వినాయకం, నాగరాజు నాయక్, అరుల్ మని పాల్గొన్నారు.

గుడిపల్లి: కుప్పంలో శుక్రవారం అంబేద్కర్ 132వ జయంతిని ఘనంగా తెలుగుదేశం పార్టీ, దళిత నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ ముఖ్యఅతిథిగా విచ్చేసి అంబేద్కర్ విగ్రహానికి గజమాలతో ఘనంగా నివాళులర్పించారు. అనంతరం గుడిపల్లి మండలంలో నూతనంగా ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జి మునిరత్నం, మాజీ ముఖ్యమంత్రి వ్యక్తిగత కార్యదర్శి మనోహర్ పాల్గొన్నారు.

గంగాధరనెల్లూరు: మండలంలో పలుచోట్ల డాక్టర్ బిఆర్.అంబేద్కర్ జయంతి వేడుకలను వివిధ పార్టీలకు చెందిన నేతలు ఘనంగా నిర్వహించారు. గంగాధర నెల్లూరులో అంబేద్కర్ విగ్రహం వద్ద డిప్యూటీ సీఎం నారాయణస్వామి, చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప, రాష్ట్ర ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ విజయానందరెడ్డి, జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎంపీపీ అనిత, వైసీపీ నేతలు సురేంద్రరెడ్డి, గుణారెడ్డి, హరిబాబు, ఢిల్లీ, మోసెస్ పాల్గొన్నారు.



నివాళి అర్పిస్తున్న డిప్యూటీ సిఎం


అలాగే మండల టిడిపి అధ్యక్షులు స్వామిదాస్, వెంకటేష్, కోదండ రెడ్డి, మునిరాజయాదవ్, సుబ్రహ్మణ్యం, బీజేపీ నేతలు రాజేంద్రన్, ఇడగట్టి సుధాకర్, మురళి, కష్ణమూర్తిరెడ్డి, కె.వెంకటాపురం దళితవాడలోని అంబేద్కర్ విగ్రహానికి సర్పంచ్ నీలావతి, వైస్ సర్పంచ్ రామూర్తి రెడ్డి, సింధూర్ సంస్థ అధ్యక్షులు రవి నివాళులు అర్పించారు. కట్టకిందపల్లె దళితవాడ, తూగుంద్రం దళితవాడలో అంబేద్కర్ చిత్రపటానికి పలువురు యువకులు పూలమాలలు వేసి స్వీట్ పంచిపెట్టారు.

కార్వేటినగరం: ప్రపంచ మేధావి, దళిత ఆశాజ్యోతి డాక్టర్ బిఆర్.అంబేద్కర్ అని ఎంపీపీ లతబాలాజీ అన్నారు. శుక్రవారం అంబేద్కర్ 132వ జయతి వేడుకలను పురస్కరించుకుని గాండ్లమిట్ట కూడలిలో కార్వేటినగరం పెద్దదళితవాడ యువత ఆధ్వర్యంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి భారీ కేక్ కట్‌చేసి ఘనంగా జరుపుకున్నారు. మండల పార్టీ కన్వీనర్ శేఖర్రాజు, మాజీ కన్వీనర్ ధనంజయవర్మ, సర్పంచ్ గోవిందస్వామి, ఎంపీటీసీ నందిని ఏఎంసీ డైక్టర్ ఆకుల గోపిశేషాద్రి పాల్గొన్నారు.

పాలసముద్రం: పాలసముద్రం గ్రామసచివాలయంలో జడ్పిటిసి సభ్యులు అన్బలగన్, సర్పంచ్ అయ్యప్ప, ఎంపీటీసీ గోవిందరాజులు, పంచాయతీ కార్యదర్శులు నరేష్ ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు,



పాలసముద్రంలో..



బంగారుపాళ్యంలో..

బంగారుపాళ్యం: విద్యాభివద్ధికి ఎన్నో సంస్కరణలు చేపట్టిన వ్యక్తి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అని జడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు అన్నారు. మండలంలోని మొగిలి వెంకటగిరి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పాలకూర రామచంద్ర రెడ్డి, వైస్‌ఎంపీపీ శిరీష్ రెడ్డి, సర్పంచులు దీప్తిరెడ్డి, ఉమాదేవి, ప్రసాద్‌రెడ్డి, ఎంఈఓ నాగేశ్వరరావు పాల్గొన్నారు. తెలుగుదేశం ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహాల నివాళులర్పించి గురుకుల పాఠశాలలో విద్యార్థులకు పండ్లను పంపిణీ కార్యక్రమం చేపట్టారు. టిడిపి మండల అధ్యక్షులు జయప్రకాష్ నాయుడు, సర్పంచ్ కాకా జయప్రకాష్ పాల్గొన్నారు.

నగరి: అంబేద్కర్ జీవితం అనుసరనీయమని ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సేవా సంఘం నాయకులు, జడ్పీటీసీ సభ్యులు గాంధీ అన్నారు. అంబేద్కర్ 132వ జయంతిని పురస్కరించుకొని సీఎస్ఐ ఆస్పత్రి నుంచి ఓంశక్తి ఆలయం వరకు 3వేల మందితో అంబేద్కర్ చిత్రపటాన్ని ర్యాలీగా ఊరేగించారు. సంఘ జాతీయ కార్యదర్శి గోవిందస్వామి, ఉపాధ్యక్షులు ఎంకె.ప్రకాష్, జిల్లా కార్యదర్శి వేలాయుధం, బాలవర్ధన్ రాజు పాల్గొన్నారు. అలాగే నగరి బస్టాండ్ ఆవరణంలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి మాజీమంత్రి గాలి ముద్దుకష్ణమ నాయుడు తనయుడు గాలి జగదీష్ పూలమాల వేసి నివాళి అర్పించారు.



నగరిలో..

సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో రాజ్యంగ నిర్మాత, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి భారత రత్న డాక్టర్ అంబేద్కర్ 132వ జయంతి సందర్భంగా బస్టాండు ప్రాంగణంలో అంబేద్కర్ విగ్రహానికి పులమాలవేసి నివాళులు అర్పించారు. సీపీఐ నియోజకవర్గం కార్యదర్శి కోదండయ్య, పట్టణ కార్యదర్శి వేలన్, బాషా, రూప్ కుమార్ అరుణ్ పాల్గొన్నారు.

పుంగనూరు: చిత్తూరు ఎంపి ఎన్.రెడ్డప్ప అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అంబేద్కర్ విగ్రహానికి ప్రముఖ వ్యాపారవేత్త రామచంద్ర యాదవ్ ప్రత్యేక గొడుగును అలంకరించి గజమాలను వేశారు. ఎంపీపీ అక్కిసాని భాస్కర్ రెడ్డి, జెడ్పిటిసి జ్ఞాన ప్రసూన చంద్రారెడ్డి యాదవ్, మాజీ ఏఎంసి చైర్మన్ నాగరాజురెడ్డి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఎమ్మార్పీఎస్ ఎంఎస్‌పి ఆధ్వర్యంలో డీజే బైక్‌ర్యాలీ నిర్వహించారు.


యాదమరి: డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 132వ జయంతిని చిత్తూరు పట్టణంలో ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్ కులాల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు ఆర్ తనిగవేలు జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. గాంధీ విగ్రహ కూడలిలో అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్ కులాల రాష్ట్ర అధ్యక్షులు నాగిశెట్టి ధర్మయ్య, ఆర్.వేలు, కె.నాగరాజా, ఆర్.రీగన్, స్టాండ్లీ, భూపతి, దినకరన్ పాల్గొన్నారు.



యాదమరిలో..

రొంపిచెర్ల: స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ఉన్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి ప్రజాసంఘాలు ఆసరా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీపీ పురుషోత్తం రెడ్డి, జడ్పిటిసి రెడ్డిశ్వర్ రెడ్డి, రొంపిచెర్ల మేజర్ పంచాయతీ సర్పంచ్ రాయచోటి ఇబ్రహీం ఖాన్ పాల్గొన్నారు.

గంగవరం: మండలంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, సచివాలయాల్లో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 132 జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.



పుంగనూరులో..

వికోట: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్ 132వ జయంతి సందర్భంగా మండల దళిత జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో అంబేద్కర్ చిత్రపటాన్ని పట్టణంలో ఊరేగించారు. అనంతరం స్థానిక అంబేద్కర్ కూడలిలా భారీ బహిరంగ సభను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంకటే గౌడ పాల్గొన్ని సీనియర్ దళిత నాయకులను సన్మానించి మెమెంటోలు అందజేశారు. ఎంపీపీ యువరాజ్, బాలగురునాథ్, పిఎన్.నాగరాజ్, ఇనయతుల్లా ఖాన్, రామచంద్రుడు, భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.




వి.కోటలో..



జిడి నెల్లూరులో..

వెదురుకుప్పం: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్ 132వ జయంతి సందర్భంగా కేర్ సంస్థ అధ్యక్షులు డేవిడ్, క్లస్టర్ ఇంచార్జి పి.మోహన్ మురళి, గ్యాస్ రవి, అంబేద్కర్ యువజన సంఘం నాయకులు భూపాల్, ప్రభాకర్, మండల ఎస్సీ సెల్ టిడిపి అధ్యక్షులు వరప్రసాద్, ఎస్సీసెల్ కార్యదర్శి సుధాకర్, మండల టిడిపి ఉపాధ్యక్షులు రజినీకాంత్, మండల టిడిపి బీసీసెల్ నాయకులు తిమ్మరాజు, వాసు మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహంకు పూలమాల వేసి ఘన నివాళులర్పించారు.

బైరెడ్డిపల్లి: మండల బిఓ సుబ్రమణ్యం ఆధ్వర్యంలో పుంగనూరు రోడ్డులోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. టిడిపి అధ్యక్షులు కిషోర్ గౌడు ఆధ్వర్యంలో స్థానిక్ చెక్‌పోస్టు కూడలిలోని అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.



గుడిపల్లిలో..

ఎస్ఆర్‌పురం: అంబేద్కర్ జయంతి సందర్భంగా మండల కార్యాయలంలో అంబేద్కర్ నూతన విగ్రహాన్నిడిప్యూటీ సీఎం నారాయణస్వామి ఆవిష్కరించారు. ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ విజయానందరెడ్డి, ఎంపీ రెడ్డప్ప, జడ్పీఛైర్మన్ శ్రీనివాసులు పాల్గొన్నారు. పుల్లూరు క్రాస్ నుంచి మండల కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. పిల్లారి కుప్పం విద్యుత్ కార్యాలయంలో ఏఈ గిరి ఆధ్వర్యంలో అంబేద్కర్‌కు నివాళి అర్పించారు.

యాదమరిలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. జడ్పీ వైస్‌ఛైర్మన్ ధనుంజయ రెడ్డి, ఎంపీపీ సురేష్, తహాశీల్దార్ వై.చిట్టిబాబు అంబేద్కర్ చిత్రపటానికి పులమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం పేదలకు అన్నదానం చేశారు. మాజీ జెడ్పిటిసి మనోహర్, వైఎస్సార్‌సిపి నాయకులు సర్పంచులు పాల్గొన్నారు.

పెద్దపంజాణి: డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 132వ జయంతి సందర్భంగా మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి ఎంపీపీ రెడ్డప్ప, వైసీపీ మండల కన్వీనర్ బాగా రెడ్డి, టిడిపి అధ్యక్షులు ఆనంద్ పూలమాలలు వేసి నివాళి అర్పించారు. మండలంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో సచివాలయాల్లో అంబేద్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు.

రామకుప్పం: టిడిపి, వైసిపి, ఎమ్మార్పీఎస్, బాస్, అన్ని సామాజిక వర్గాలు అంబేద్కర్ చిత్రపటానికి పూజలు చేసి ఘనంగా నివాళులర్పించారు. ఎంపీపీ సుబ్రహ్మణ్యం, వైసీపీ మండల కోకన్వీనర్ చంద్రారెడ్డి, సర్పంచ్ మురళి, ప్రచార కార్యదర్శి కేశవరెడ్డి, వైసీపీ నేతలు సెంథిల్, ప్రసాద్, అబ్దుల్, శంకర్ పాల్గొన్నారు.

ఫ్లెక్సీ ఏర్పాటు పై చిత్తూరు ఎంపీ చిందులు

ప్రజాశక్తి- పుంగనూరు: పుంగనూరు పట్టణంలో స్థానిక అంబేద్కర్ సర్కిల్‌లో ప్రముఖ వ్యాపారవేత్త రామచంద్ర యాదవ్ అంబేద్కర్ 132వ జయంతి సందర్భంగా శుభాకాంక్షలు తెలుపుతూ ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా విగ్రహానికి పూలమాల వేయడానికి చిత్తూరు పార్లమెంట్ సభ్యుడు ఎన్.రెడ్డప్ప అంబేద్కర్ సర్కిల్‌కు శుక్రవారం రావడం జరిగింది. అక్కడ ఉన్న ఫ్లెక్సీని చూసి ఆయన దళిత సంఘం నేతలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఫ్లెక్సీని ఎవరు పెట్టారని వెంటనే దీన్ని తొలగించాలని నాయకులపై చిందులు తొక్కారు. రామచంద్ర యాదవ్ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ వెంటనే తొలగించాలని అక్కడ ఉన్న నేతలకు ఆదేశించారు. అయితే వారు ఫ్లెక్సీనీ తొలగిస్తే వివాదం వస్తుందని తొలగించమని చెప్పారు. ఒకవేళ ఉంటే ఆ ఫ్లెక్సీ ఒక్కరోజు మాత్రమే ఉంటుంది సార్ మీరు పూలమాలవేసి బయలుదేరండి సార్ అని చెప్పారు. రేపు మేమే తీసివేస్తామని ఎంపీకి నచ్చ చెప్పడానికి ప్రయత్నించగా అదేమీ వద్దు అంటూ ఆగ్రహంగా వారి డ్రైవర్ను పిలిచి ఫ్లెక్సీలు తొలగించమని చెప్పారు. కేసు పెడితే నాపైన పెట్టుకొని అంటూ ఫ్లెక్సీలు తొలగించారు. దీనిపై దళిత నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. దళిత సంఘ నాయకులు తొలగించడానికి ఎవరు ముందుకు రాలేదు. అంబేద్కర్ జయంతి రోజు ఫ్లెక్సీ ఏర్పాటు చేయడం వారి అభిమానాన్ని చాటుకున్నారు కానీ అంబేద్కర్ అందరివాడు అని వివాదాలు వద్దని అక్కడి నేతలు చెప్పారు. ఫ్లెక్సీ తొలగించిన తర్వాత అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి చిత్తూరు బయలుదేరి వెళ్లారు. దీనిపై దళితసంఘం నేతలు అంబేద్కర్ అందరివాడని వారి అభిమానం చాటుకున్న దాన్ని కూడా ఇలా చేయడం సమంజసం కాదని పలువురు విమర్శిస్తున్నారు.

అందరి సమిష్టి కృషితో పంచాయతీ అభివృద్ధి

ప్రజాశక్తి- కార్వేటినగరం

పంచాయతీ అభివద్ధికి అందరి సహకారం ఎంతో అవసరమని మేజర్ పంచాయతీ కార్వేటినగరం సర్పంచ్ ధనంజయవర్మ అన్నారు. శుక్రవారం పంచాయతీ కార్యాలయం ఆవరణంలో ఏర్పాటు చేసిన గ్రామసభలో సర్పంచ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ అభివద్ధికి అన్నివిధాల సహాయ సహకారాలను అందిస్తోందని తెలిపారు. వార్డుమెంబర్లు క్షేత్రస్థాయిలోని సమస్యలను వెంటనే పరిష్కరించడానికి సహకరించాలని కోరారు. పంచాయతీ ఆదాయవనరుల ద్వారా వచ్చిన ఆదాయాన్ని పంచాయతీ అభివద్ధికి వెచ్చించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ కార్యాలయాల నుంచి రావాల్సిన విద్యుత్ బిల్లులను వెంటనే చెల్లించడానికి అధికారులు సహకరించాలని పేర్కొన్నారు. అనంతరం పంచాయతీ ఈవో మాట్లాడుతూ డంపింగ్ యార్డుల్లో వ్యర్థాల ద్వారా ఇప్పటి వరకు తయారు చేసిన 2 టన్నుల సేంద్రియ ఎరువులు అందుబాటులో ఉన్నాయని రైతులకు రూ.8ల చొప్పున పంపిణీ చేస్తామన్నారు. ఆసక్తి కలిగిన రైతులు ముందుకొచ్చి కొనుగోలు చేసుకోవచ్చన్నారు. అనంతరం పలు అభివద్ధి పనులకు సిద్ధం చేసిన ప్రణాళికకు వార్డు మెంబర్లు ఆమోదం తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రధానకార్యదర్శి బాలాజీ, ఉపసర్పంచ్ శేషాద్రి. తహశీల్దార్ రఫీజ్ అహ్మద్, ఈవో పీఆర్డీ లక్ష్మీపతి, ఎఎంసీ వైస్‌చైర్మన్ గోపి, ఎంపీటీసీ వెంకటేష్ పాల్గొన్నారు.

గ్రామసభలతోనే సమస్యల పరిష్కారం : ఎంపిపి

ప్రజాశక్తి- వికోట

ప్రజాసమస్యల పరిష్కారానికి గ్రామసభలు ఎంత తోడ్పడతాయని ఎంపీపీ యువరాజ్ తెలిపారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్ జయంతి సందర్భంగా శుక్రవారం మండల పరిధిలోని 18 గ్రామపంచాయతీలలో గ్రామసభలు నిర్వహించారు. చింతమాకులపల్లిలో నిర్వహించిన గ్రామసభకు ఎంపీపీ హాజరై పలు ప్రజాసమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. మేజర్ గ్రామపంచాయతీ కేంద్రమైన వికోటలో సర్పంచ్ పిఎన్.లక్ష్మీ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామసభకు పెద్ద ఎత్తున ప్రజలు హాజరయ్యారు. అభివద్ధి సంక్షేమపథకాలు పారదర్శకంగా అందిస్తున్నామని, ఇంకా మిగిలిన అర్హులైన ప్రతిఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తామని అన్నారు. వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిఎన్ నాగరాజ్, ఎంపీడీవో మహేష్ బాబు, ఈవో యాదవ్‌పతి, సర్పంచ్లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఇంటింటా అపూర్వ ఆదరణ..

ప్రజాశక్తి- కార్వేటినగరం:

జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమానికి ఇంటింటా అపూర్వ ఆదరణ లభిస్తోందని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ముక్కరవానిపల్లి, గంగమాంబాపురం, ముక్కరవానిపల్లి ఏఎడబ్ల్యూ, గంగమాంబాపురం హెచ్‌డబ్ల్యూ గ్రామాల్లో వైఎస్సార్సీపీ నేతలు, స్థానిక సచివాలయ కన్వీనర్లు, గహసారధులతో కలసి గడప గడపకు వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. కుటుంబ సభ్యుల అనుమతితో ఇంటి గోడపై స్టిక్కర్లు అంటించారు. వైఎస్ జగన్మోహన్రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత తమకు అనేక విధాలుగా లబ్ధి చేకూరుతుందని, మళ్లీ జగనన్నే సీఎం అవుతారని ప్రజలు తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. మండల కన్వీనర్ శేఖర్రాజు పట్టాభిరెడ్డి, మురార్రెడ్డి, చందురాజు, దొరస్వామి, రాజ, శోధన్‌బాబు, అర్జునయ్య పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన



ప్రజాశక్తి- రొంపిచెర్ల: మండల పరిధిలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో స్వచ్ఛంద సంస్థలు, జాతీయ మానవ హక్కుల సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ప్రజలకు సమాచార హక్కు చట్టం 2005పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం ద్వారా ప్రజలకు అనేక లాభాలు ఉన్నాయని ఈ చట్టం ద్వారా ప్రభుత్వ కార్యాలయాలలో ప్రజలకు కావలసిన ఎటువంటి సమాచారాన్ని అయినా ఈ చట్టం ద్వారా తెలుసుకోవచ్చని ప్రజలకు తెలియజేశారు. ఈకార్యక్రమంలో విద్యావేత్త డాక్టర్ టి.రఘునాథ్, ఆసరా స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు ధనంజయ, జాతీయ బిసి సంక్షేమ సంఘం రాయలసీమ జిల్లాల అధికార ప్రతినిధి బంగారు నారాయణస్వామి, రొంపిచర్ల మండలం బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు నూరేషా, జాతీయ మానవ హక్కుల సంఘం ప్రధాన కార్యదర్శులు మల్లేపల్లి వెంకటేష్, దేవులపల్లి అశోక్ కుమార్ రెడ్డి, నాయి బ్రాహ్మణుల సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అగ్నిమాపక వారోత్సవాలు ప్రారంభం



ప్రజాశక్తి- నగరి: రాష్ట్ర విపత్తు స్పందన, అగ్నిమాపక సేవల శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి నగరి పట్టణంలో అగ్నిమాపక వారోత్సవాలు ప్రారంభించినట్లు అగ్నిమాపక అధికారి ఎస్ మస్తాన్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నగరి ఏరియా హాస్పిటల్ ఆర్ఎంఓ డాక్టర్ గోపాల్, డాక్టర్ ప్రసాద్ పాల్గొన్నారు. అనంతరం ఆయన వారోత్సవాల కరపత్రాలను విడుదల చేసి ప్రజలకు పంచిపెట్టారు. అనంతరం అగ్నిమాపక కేంద్రం ఆవరణంలో మొక్కలు నాటారు. అగ్ని ప్రమాదంలో మతిచెందిన అగ్నిమాపక సిబ్బందికి రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. ఈనెల 20వ తేదీ వరకు పలు కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. అగ్నిప్రమాదాలు విపత్తులు చోటు చేసుకున్నప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అగ్నిమాపక సిబ్బంది కెబిబి ప్రతాప్, డిసి.రాజు, ఎస్.ప్రవీణ్ కుమార్, వి.విజయ, ఎన్.మల్లికార్జున, టి.కోటేశ్వరరావు, కె.మధు, డి.జాకీర్ పాల్గొన్నారు.

అంబేద్కర్ జయంతి రోజునే...

దళితులపై పెత్తందారుల మూకుమ్మడి దాడి



ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

అంబేద్కర్ జయంతి రోజునే దళితులపై పెత్తందారులు మూకుమ్మడి దాడిచేసిన ఘటన తిరుపతి జిల్లా రామచంద్రాపురం మండలం నెన్నూరులో చోటు చేసుకుంది. బాధితుల వివరాల మేరకు... అంబేద్కర్ జయంతి పురస్కరించుకుని నెన్నూరు పక్కనే ఉన్న నడవలూరు ఐఎవై కాలనీ దళితవాడలోని కమ్యూనిటీ హాలులో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మురళి, మణికంఠలకు చెందిన ఆటో, స్కూటర్లు రోడ్డు పక్కన పార్కింగ్ చేశారు. దీంతో నెన్నూరుకు చెందిన టిడిపి మాజీ వైస్ ఎంపిపి మధుసూదన్‌రెడ్డి అనుచరులు దళితులను దూషిస్తూ 'మాది...కు అధికారం ఇస్తే ఇలాగే ఉంటుంది, ముందు బండ్లు తీయి' అంటూ కులం పేరుతో దూషించారు. మురళి, మణికంఠలపై దాడికి పాల్పడ్డారు. వైసిపిలో చేరి రాజకీయాలు చేస్తున్నారా? అంటూ బూతులు తిట్టారు. దీంతో తమకు న్యాయం చేయాలని రామచంద్రాపురం పోలీసు స్టేషన్‌లో బాధితులు మురళి, మణికంఠలు రక్తగాయాలతో ఫిర్యాదు చేశారు. ఉదయం జరిగిన ఘటనకు సాయంత్రం అయినా కేసు నమోదు చేయకపోవడంతో సిపిఎం, మాదిగ మహాజన నాయకుల ఆధ్వర్యంలో పోలీసు స్టేషన్ ముందు బాధితులకు మద్దతుగా నిరసన తెలిపారు. కేసు నమోదు చేసి ఎస్‌సి, ఎస్‌టి కేసు నమోదు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు డిమాండ్‌చేశారు. దీంతో ఎస్ఐ గిరిధర్ కేసు నమోదు చేసి, చికిత్స నిమిత్తం మురళి, మణికంఠ, మరో ఇద్దరిని రుయాకు తరలించారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకులు పరశురాం, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు ఎన్‌డి శ్రీను, మాదిగమహాజన నాయకులు సుధాకర్ పాల్గొన్నారు.



బాధితుని పరామర్శిస్తున్న సిపిఎం, కెవిపిఎస్ నేతలు

విగ్రహానికి 'చెదలు'


పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి- వెదురుకుప్పం : మండలంలోని కొమరగుంట సబ్‌స్టేషన్ వద్ద మాజీ ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి విగ్రహం చెదలు పట్టి దయనీయస్థితిలో పడిఉంది. గతంలో వైఎస్సార్ విగ్రహాన్ని మండలంలో ప్రతిష్టించేందుకు నాయకులు తీసుకున్నారు. అయితే ఎక్కడ ప్రతిష్టించాలో సరైన ఆలోచన లేకవడంతో విగ్రహాన్ని భద్రపరచకుండా కవర్లు చుట్టి సబ్‌స్టేషన్ లోపల అలాగే వదిలేశారు. గత కొన్నేళ్లుగా ఆ విగ్రహం అలాగే ఉండటంతో చెదలు పట్టి పతనదశకు చేరుకుంది. రాష్ట్రాన్ని పరిపాలించిన మహానాయకుడి విగ్రహాన్ని ఇలా వదిలేయం ఎమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి మండలంలో అవకాశం ఉన్న చోట విగ్రహాన్ని ప్రతిష్టాంచాలని స్థానికులు కోరుతున్నారు.



ఆ భూములతో పురావస్తు శాఖకు సంబంధం లేదు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో



గ్రామంలో ఆర్డీవో విచారణ

మా పేరిట రికార్డులు ఉన్న భూములను పురావస్తు శాఖకు అప్పగించలేమని వరదయ్యపాలెం మండలం సుబ్బానాయుడు కండ్రిగకు చెందిన రైతులు సూళ్లూరుపేట ఆర్డిఓ చంద్రమౌళికి విన్నవించారు. వరదయ్యపాలెం మండలం పెద్ద పాండురు రెవిన్యూలో గల ముట్టంగి తిప్ప భూములను శుక్రవారం సూళ్లూరుపేట ఆర్డీవో చంద్రమౌళి, స్థానిక మండల తహసిల్దార్ గౌరీ శంకర్రావుతో కలిసి సందర్శించారు. క్షేత్రస్థాయిలో భూములను పరిశీలించారు .అనంతరం సుబ్బానాయుడు కండ్రిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో స్థానిక రైతులతో ఆర్డిఓ మాట్లాడి వారి అనుభవంలో ఉన్న భూములకు సంబంధించి రికార్డులను పరిశీలించారు .మండల రెవెన్యూ రికార్డులను పరిశీలించారు. అనంతరం రైతుల విన్నపాలను ఆయన విన్నారు . వారికి మద్దతుగా వచ్చిన సీపీఐ సత్యవేడు నియోజకవర్గ కార్యదర్శి ఆంబాకం చిన్నిరాజు రైతుల సమస్యల్ని సవివరంగా విన్నవించారు. 60ఏళ్లకు పైగా రైతుల అనుభవం లో వున్న భూములను పురావస్తు శాఖకు కేటాయించడం ఏమిటని ప్రశ్నించారు. పురావస్తు శాఖ వారు 70 ఏళ్ల క్రితమే ముట్టంగి తిప్ప భూములను వారికి కేటాయించినట్లు చెబుతున్నారు.. అయితే ఇన్ని సంవత్సరాలుగా.. సంబంధిత భూముల్లో ఎలాంటి కార్యకలాపాలు.. చేపట్టకనే ఉన్నఫళంగా ఆ భూములు తమవని పురావస్తు శాఖ అనడం సబబు కాదని ఆర్ డీ ఓ కి వివరించారు. రైతుల విన్నపాలపై సానుకూలంగా స్పందించిన ఆర్డిఓ క్షేత్రస్థాయిలో ఉన్న పరిస్థితులను జిల్లా కలెక్టర్ కు సవివరంగా నివేదిక అందజేస్తామన్నారు .కలెక్టర్ నిర్ణయం మేరకు చర్యలు తీసుకుంటామని రైతులకు హామీ ఇచ్చారు .అప్పటివరకు సంబంధిత భూముల్లో పురావస్తు శాఖ వారు పనులు చేపట్టేందుకు వీలులేదని సూచించారు. ఆయన వెంట ఆర్ ఐ వేణుగోపాల్, మండల సర్వేయర్ రమణ, ఆదిలక్ష్మి వున్నారు.

తాతయ్యగుంట గంగమ్మకు కొబ్బరికాయల మొక్కు



ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తిరుపతి శ్రీ తాతయ్యగుంట గంగమ్మ జాతరను రాష్ట్ర పండుగగా గుర్తిస్తూ ప్రభుత్వం జీవో విడుదల చేయడం పట్ల హర్షం వ్యక్తమవుతోంది. ఇందుకు కృషి చేసిన తిరుపతి ఎంఎల్ఎ భూమన కరుణాకర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతూ వైఎస్ఆర్‌సిపి నాయకులు గంగమ్మ గుడి ముందు 1001 కొబ్బరికాయలు కొట్టి మొక్కు తీర్చుకున్నారు. నగర మేయర్ డాక్టర్ శిరీష, డిప్యూటీ మేయర్లు భూమన అభినయ్‌రెడ్డి, ముద్రనారాయణలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం గంగమ్మ గుడి గర్భాలయ పనులను పరిశీలించారు.

భీమా జ్యూవెలరీ షోరూం ప్రారంభం

ప్రజాశక్తి-తిరుపతి సిటి



తిరుపతి నగరంలో బంగారు షాపులకు జతగా భీమా జ్యూవెలర్స్ వచ్చి చేరింది. నూతనంగా ఏర్పాటు చేసిన భీమా జ్యూవెలర్స్‌ను ప్రముఖ హీరోయిన్ సంయుక్త శుక్రవారం ప్రారంభించారు. ప్రకాశం రోడ్డులోని ఎస్‌వి హైస్కూల్ మైదానం పక్కన నూతనంగా ఏర్పాటు చేసిన భీమా జ్యూవెల్స్ షోరూమ్ వద్దకు చేరుకున్న ఆమె అభిమానులకు అభివాదం చేశారు. జ్యోతిప్రజ్వలనతో షోరూమ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీమా జ్యూవెలర్స్‌తో తనకు చిన్నప్పటి నుంచి పరిచయం ఉందన్నారు. తమ ఇంటిల్లిపాది ఇక్కడే జ్యూవెలర్స్ కొనుగోలు చేశామని తెలిపారు. అత్యాధునిక వెరైటీలతో, నాణ్యతలో రాజీ లేకుండా ఇక్కడ ప్రతి ఒకర్నీ మెప్పించగలిగే ఆభరణాలు లభ్యమవుతాయన్నారు. దీన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సంస్థ ఎండి అభిషేక్ బిందుమాదవ్ మాట్లాడుతూ 1925లో ఏర్పాటు చేసిన తమ సంస్థకు దేశ వ్యాప్తంగా 56 షోరూమ్‌లు ఉన్నాయని, తిరుపతిలో ఏర్పాటు చేసినది 57వ షోరూం అన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రెండు తెలుగు రాష్ట్రాల్లో కలిపి నాలుగు షోరూమ్‌లు ఉన్నాయన్నారు. సరికొత్త ఆగ్యూమెంట్ రీయాల్టీ టెక్నాలజీతో సరొకిత్త వెడ్డింగ్ కలెక్షన్లు లభ్యమవుతాయన్నారు. గోల్డ్, డైమాండ్స్, ప్లాటీనాం, సిల్వర్ ఆభరణాలు నాణ్యతలో రాజీ లేకుండా అందిస్తున్నామన్నారు. తిరుపతిలో షోరూమ్ ప్రారంభం సందర్భంగా సరికొత్త ఆఫర్లు ప్రకటించామన్నారు. గ్రాము బంగారుకు 300 రూపాయలు తగ్గింపు, డైమాండ్ జ్యూవెలర్స్‌పై 15వేలు, కేజీ సిల్వర్ ఆభరణాల కొనుగోలుపై 3వేలు తగ్గింపు ధరలు అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. దీన్ని తిరుపతి, పరిసర ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సంస్థ చైర్మన్ బిందుమాదవ్ మాట్లాడుతూ గత 97 సంవత్సరాలుగా ఆభరణాల విక్రయాల్లో తమకు మేమే సాటిగా, వినియోగదారులకు నాణ్యమైన, సరికొత్త డిజైన్లతో కూడిన ఆభరణాలు అందిస్తూ, వారి మన్ననలను పొందామన్నారు. ఇప్పుడు తిరుపతిలో ఏర్పాటు చేసిన షోరూమ్‌ను అందరూ సందర్శించి, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సరోజిని బిందుమాదవ్, మేయరు డాక్టరు శిరీషా, కార్పొరేటర్ హనుమంతునాయక్ పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి:



ద్విచక్రవాహనం అదుపు తప్పి ఓ మహిళ మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పుంగనూరు మండలం బైరవామంగళం గ్రామానికి సీనప్ప అతని భార్య గంగోజమ్మ(45) సొంతపనుల నిమిత్తం బైరెడ్డిపల్లి నుంచి చిన్నచల్లారిగుంటకు ద్విచక్రవాహనంలో వెళుత్తుండగా బైరెడ్డిపల్లి - పుంగనూరు జాతీయ రహదారిలోని లక్కపల్లి గ్రామ సమీపంలో శెట్టిపల్లి క్రాస్ వద్ద ద్విచక్రవాహనం అదుపు తప్పి కిందపడ్డారు. గంగోజమ్మ తలకు దెబ్బతగిలి తీవ్రరక్తస్రావం కావడంతో ఆమె అక్కడిక్కడే మరణించింది. అలాగే మరో ద్విచక్రవాహనంలో ప్రయాణిస్తున్న మొగిలమ్మ, సుబ్రమణ్యలంకు తీవ్రగాయాలు కావడంతో స్థానికులు 108 ద్వారా మెరుగైన చికిత్స నిమిత్తం కుప్పం టిఎస్ ఆసుపత్రికి తరలించారు. ఎస్ఐ సంఘటనా స్థలానికి చేరుకుని గంగోజమ్మ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

టిడిపి సీనియర్ నేత మృతి



ప్రజాశక్తి- రామకుప్పం: మండల కేంద్రం దాసిరివీధిలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత మతి చెందాడు. శుక్రవారం ఉదయం వెంకటస్వామి (92) అనారోగ్యంతో మతి చెందాడు. టిడిపి పార్టీ నేతలు ఆయన భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నేతలు మాట్లాడుతూ టిడిపి పార్టీ బోలోపేతానికి, సభ్యత్వ నమోదుకు ఎనలేని కషి చేశారన్నారు. ఆయన మతి పట్ల పార్టీకి తీరని లోటుని అన్నారు. వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. టిడిపి ఎల్లప్పుడు అండగా ఉంటుందని మనోధైర్యాన్ని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు మునస్వామి, మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి, కార్యదర్శి నరసింహులు, జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షులు కష్ణ నాయక్, నేతలు సుబ్రి, రామకష్ణప్ప, గంట్లప్ప గౌడు, రామలింగారెడ్డి, మహమ్మద్ రఫీ, కామరాజ్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌జెండర్లను కుటుంబసభ్యులు ఆదరించాలి

ప్రజాశక్తి - క్యాంపస్: ట్రాన్స్‌జెండర్లను కుటుంబసభ్యులు ఆదరించాలని, చిన్నతనం నుంచే వారి హక్కులను తల్లిదండ్రులు గౌరవించి వారికి తగ్గట్టుగా పిల్లల్ని మలచుకున్నపుడు మానసికంగా కుంటుబాటు ఉండదని వక్తలు అన్నారు. వాలంటరీ హెల్త్ సర్వీస్, వన్‌స్టాప్ సెంటర్ (ఎన్జీవో), శ్రీ పద్మావతి మహిళా విశ్వ విద్యాలయంలోని మహిళా అధ్యయన కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో జాతీయ ట్రాన్స్‌జెండర్ దినోత్సవాన్ని భవానినగర్‌లోని వన్‌స్టాప్ సెంటర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా కోఆర్డినేటర్ ఎ.మురళీమోహన్‌రెడ్డి మాట్లాడుతూ ట్రాన్స్‌జెండర్ల హక్కులను గౌరవించాలన్నారు. మహిళా అధ్యయన కేంద్రం రీసెర్చి అసోసియేట్ డాక్టర్ టి.చైతన్య మాట్లాడుతూ ట్రాన్స్‌జెండర్ల సంక్షేమ అభివృద్ధిలో భాగంగా మానసిక, సామాజిక, ఆర్థిక, విద్య, సాంస్కృతిక రంగాలలో ముందుండాలన్నారు. సమాజంలోని అందరిలో గుర్తింపు కోసం పాటు పడాలన్నారు. డిప్యూటీ తహశీల్దార్ విజయభాస్కర్, డిస్ట్రిక్ట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ డాక్టర్ లతాకుమారి, మహిళా అధ్యయన కేంద్ర రీసెర్చి అసిస్టెంట్ డాక్టర్ ఎం.ఇంద్రాణి పాల్గొన్నారు.